ప్రజాశక్తి
గురువారం 4 జులై 2024 5 అనంతపురం





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

జిల్లా మలేరియా అధికారి ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం

సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య, శాఖాధికారి కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం కావున ల్యాబ్ టెక్నీషియన్లు తమ పరిధిలోని అర్బన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జ్వర లక్షణాలు ఉన్న వారికి రక్త పూత పరీక్షలు చేసి స్థానిక వైద్యాధికారికి నివేదిక ఇవ్వాలని సూచించారు. అలాగే ల్యాబ్ రికార్డుల నిర్వహణ పక్కాగా నిర్వహించాలని కోరారు. క్షేత్ర స్థాయి సిబ్బంది అందించే రక్తపూతల పరీక్షల నిర్వహణలో అలసత్వం ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, మలేరియా కార్యాలయ సిబ్బంది గిరిధర్‌రెడ్డి, రమేష్, రాఘవరెడ్డి, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి పరీక్షలు వాయిదా

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం నిర్వహించాల్సిన పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యువేషన్ ఇ.కేశవరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థల బంద్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తదుపరి పరీక్షలను నిర్వహించే తేదీలను జెఎన్‌టియు వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని కోరారు.

టెట్ గడువు పొడిగించాలి

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ టెట్ పరీక్షకు గడువు పెంచాలని డివైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం డీఎస్సీ అభ్యర్థులతో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ఎపి ప్రభుత్వం జులై 2న టెట్‌కు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఇందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు అన్నారు. అయితే నోటిఫికేషన్ విడుదల రోజు నుంచి పరీక్ష రోజు వరకూ చాలా తక్కువ సమయం ఉండటంతో సిలబస్ పూర్తి చేయడం చాలా కష్టంగా మారిందన్నారు. కావున టెట్ పరీక్ష నిర్వహణకు గడువు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, జిల్లా నాయకులు నూరుల్లా, డీఎస్సీ అభ్యర్థులు చెన్నయ్య, సూరి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

విశాల ఫెర్రర్‌ను కలిసిన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



విశాల ఫెర్రర్‌కు పూల మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి దంపతులు

అనంతపురం : ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛూఫెర్రర్ సతీమణి విశాల ఫెర్రర్‌ను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, భర్త పల్లె కిషోర్ బుధవారం స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా విశాలఫెర్రర్‌ను శాలువతో సత్కరించారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బారావు పాల్గొన్నారు.

పిఎబిఆర్‌కు నిధుల గ్రహణం



పనులకు అనుమతులు మంజూరు
నిర్వహణకు నిధులు కరువు
కాలువలకు మరమ్మతులు లేవు
గేట్లకు గ్రీసు లేదు
'అనంత' నీటివనరు పిఎబిఆర్‌కు దిక్కులేదు

ఉమ్మడి అనంతపురం జిల్లాకు గుండెకాయ వంటిది పెన్నహోబిలం బ్యాలెన్సింగు రిజర్వాయర్. అంతటి కీలకమైన ప్రాజెక్టుకు నిధుల్లేక కనీస మరమ్మతులకు నోచుకోకుండా ఉంది. జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తే పనులకు అనుమతులిచ్చారు. అయితే పైసలివ్వకపోవడంతో ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఏదైనా అనుకోని పరిస్థితులు ఎదురవుతే మరమ్మతులు లేక ఆపరేటింగు కూడా కష్టమయ్యే ప్రమాదం పొంచి ఉంది. రెండేళ్లుగా నిర్వహణకు నిధులు మంజూరుకాకపోవడంతో ప్రధానమైన ప్రాజెక్టు పరిస్థితి అధ్వాన్నంగా మారింది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర నుంచి వచ్చే నీరైనా, శ్రీశైలం నుంచి హంద్రీనీవా ద్వారా వచ్చేనీరైనా పెన్నహోబిలం రిజర్వాయర్‌లో నిలువ చేసుకునే అవకాశముంది. అటు సాగు, ఇటు తాగునీటికి రెండింటికి దీని నుంచే నీరు అందిస్తున్నారు. ఇంత కీలకమైన ప్రాజెక్టు నిర్మాణంలోనే లోపాలు తలెత్తాయి. 11 టిఎంసిల సామర్థ్యమున్న ఈప్రాజెక్టు స్పిల్‌వేలో లీకేజీతో ఐదు టిఎంసిలకు మించి నీరు నిలువ చేయలేని పరిస్థితి నెలకొంది. దీనికి జీయో మెమ్రైన్ ద్వారా మరమ్మతులు చేస్తే పూర్తి సామర్థ్యంతో నీరు నిలువ ఉంచవచ్చు. కానీ ఆ పనులు అనేక ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఇకపోతే ఉన్న వరకైనా తక్షణ మరమ్మతులు చేపట్టాల్సినవి ఉన్నాయి. వాటికి కూడా రెండేళ్లుగా నిధుల్లేవు. కేవలం ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. కనీసం రేడియెల్ గేట్లకు గ్రీసు పెట్టేందుకు కూడా నిధుల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇక కాలువల పరిస్థితి వేరే చెప్పనక్కర్లేదు. ఎక్కడివక్కడే గండ్లుపడ్డాయి. వాటి మరమ్మతులకు 2022లో ప్రతిపాదనలు పంపిస్తే ప్రభుత్వం వాటిని అనుమతులిచ్చింది. కాని పైసలు విడుదల చేయకపోవడంతో టెండర్లు కూడా పిలువడానికి వీల్లేకుండా ఉండిపోయింది.

ఆర్థికమంత్రి అయినా దృష్టి పెట్టేరా ?

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సొంత నియోజకవర్గంలోనే ఈ ప్రాజెక్టు ఉంది. ఆయనైనా ఈప్రాజెక్టు బాగోగులపై దృష్టి సారించి, మరమ్మతులకు నిధులు విడుదల చేస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

అధికారులు చేసిన ప్రతిపాదనలు	అంచనా వ్యయం
పిఎబిఆర్ విద్యుత్ ఛార్జీలు	రూ.31.80 లక్షలు
డ్యామ్ దిగువ భాగంలో డ్రైన్ మరమ్మత్తులకు	రూ.2.00 లక్షలు
డ్రైనేజీ గ్యాలరీ క్లీనింగు	రూ.4.20 లక్షలు
రేడియల్ గేట్లు, మోటర్లు మరమ్మత్తులు	రూ.6.70 లక్షలు
జనరేటరు రిపేరీ	రూ.4.40 లక్షలు
పనిచేసే సిబ్బందికి	రూ31.10 లక్షలు
పిఎబిఆర్ కాలువ పలుచోట్ల మరమ్మతులకు	రూ.75.30 లక్షలు

గూగూడు ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల



కుళ్లాయిస్వామి ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి ఉత్సవాలకు పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 7వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎమ్మెల్యే బుధవారం గూగూడులో పర్యటించి అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ముందుగా ఆంజనేయస్వామి, కుళ్లాయిస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు హుసేనప్ప ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 13వ తేదీ వరకూ ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్రం నుండే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారన్నారు. ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేస్తూ ఎక్కడా నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు, నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆకుల విజయ్‌కుమార్‌బాబు, ప్రతాప్‌చౌదరి, చంద్రబాబు, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ రాముడు, ఇఒఆర్‌డి శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ రవీందర్‌నాథ్‌రెడ్డి, సలేహా, రాధాకృష్ణ, నాగభూషణం, ఇస్మాయిల్, లోకేష్, జాఫర్‌వలి, రాజన్న, ఓబులేసు, రాజేష్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

అంగన్వాడీల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు అచ్చుత్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సురేంద్రబాబును బుధవారం కలిసి పలు సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినిట్స్ కాపీ ఆధారంగా జీవోలను అమలు చేయాలని కోరారు. జీవో 17ను మార్పు చేయాలని, అంగన్వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఆయాలకు రూ.50 వేలు, అంగన్వాడీలకు రూ.లక్ష ఇవ్వాలన్నారు. అంగన్వాడీ సెంటర్లకు ప్రభుత్వ భవనాలు మంజూరు చేసి సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ వెల్ఫేర్ యూనియన్ అధ్యక్షురాలు కాంతమ్మ, కార్యదర్శి రమాదేవి, పాతక్క, తిప్పీరమ్మ, రాధా, విజయనిర్మల, సుధారాణి, అపర్ణ, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి పచ్చదనాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి-బొమ్మనహాల్



మొక్క నాటుతున్న అధికారులు

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి పచ్చదనాన్ని కాపాడుకుందామని తహశీల్దార్ రామాంజనమ్మ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కణేకల్లు-బళ్లారి ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు విరివిగా మొక్కలు నాటాలన్నారు. ప్రతి గ్రామంలో 500 మొక్కలు నాటి కాపాడితే రాబోవు తరానికి మనమిచ్చే ఆస్తిపాస్తులు ఇచ్చినవారం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, మండల విద్యాధికారి ఈరన్న, పశు వైద్యాధికారి వెంకట్‌రెడ్డి, ఉపాధి హామీ ఎపిఒ రమేష్, ప్రధానోపాధ్యాయులు రాజ్‌కుమార్, టిడిపి నాయకులు పయ్యావుల అనిల్, రామకృష్ణ, వెంకటేశులు, సర్పంచి భర్త లాలప్ప, పంచాయతీ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ఉపాధి హామీ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-యాడికి

తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డికి యాడికిలో టిడిపి నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి హయాంలో ఎంతో వెనుకబడిన యాడికి అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కిద్దామన్నారు. ప్రతివారం మండలానికి వచ్చి సమస్యలు అడిగి తెలుసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, పరిమి చరణ్, రజక శేఖర్, నాగ మునిరెడ్డి, శ్యామ్‌సుందర్ నాయుడు, గండికోట లక్ష్మణ్, చంద్రశేఖర్‌రెడ్డి, విజన్ విశ్వనాథ్ విక్రం, తెల్లాకుల వెంకటేష్, బాలచంద్రుడు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

వికలాంగులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వికలాంగులకు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఎప్పటికీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. వికలాంగులకు ప్రభుత్వం అందించే పింఛన్ రూ.3 నుంచి రూ.6వేలకు పెంచిన నేపథ్యంలో బుధవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ నాయకులు ఉమాప్రసాద్, రాఘవేంద్ర, అశ్విని, మారుతి వసంత కుమార్, నవీన్ కుమార్, టిడిపి రాష్ట్ర నాయకులు గంగారామ్, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచి హరి, మైనార్టీ నాయకుడు ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి

తాగునీరుతోపాటు మౌలిక సమస్యలను పరిష్కరించాలని అనంతసాగర్, విజయనగర కాలనీవాసులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కి విన్నవించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి, బికెఎస్ మండల కన్వీనర్ అశోక్, మాజీ సర్పంచి లక్ష్మీనారాయణ, అనంతసాగర్ విజయనగర కాలనీవాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నారా లోకేష్‌ను కలిసిన ప్రయివేటు స్కూళ్ల అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం



నారా లోకేష్‌కు పుస్తకాన్ని అందజేస్తున్న ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు

ప్రయివేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం విజయవాడలోని మంత్రి లోకేష్ స్వగృహంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో తమకు ఇచ్చిన హామీలను మంత్రికి విన్నవించారు. ఇందుకు మంత్రి లోకేష్ స్పందిస్తూ సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎడిపిఎస్ఎ జిల్లా సంఘం అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, సిఆర్ఒ రవిచంద్రారెడ్డి, నగర గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, గౌరవ సలహాదారులు రామాంజనేయులు, ముదిగుబ్బ పిబిఎస్.నాయుడు, బత్తలపల్లి లక్ష్మీనారాయణ, పెనుకొండ డివిజన్ నాయకులు చిత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో వసతిగృహం

శిథిలావస్థలో హాస్టల్ భవనం - భయాందోళనలో విద్యార్థులు
ఆవరణలో అపరిశుభ్రత - ఇసురాళ్లపల్లి బీసీ బాలుర హాస్టల్‌లో పరిస్థితి





ఇసురాళ్లపల్లి బిసి బాలుర వసతిగృహం, (ఇన్‌సెట్‌లో) తలుపులు కూడా సరిగా లేని మరుగుదొడ్లు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామంలో ఉన్న బీసీ సంక్షేమ బాలుర వసతిగృహం అధ్వాన్నంగా మారింది. ఎక్కడి సమస్యలు అక్కడే తాండవిస్తోన్నాయి. గ్రామంలో 30ఏళ్ల క్రితం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ నిధులు రూ.లక్షలు వెచ్చించి బాలుర వసతిగృహాన్ని నిర్మించారు. ప్రస్తుతం వసతిగృహంలో 35 మంది 10వ తరగతి విద్యార్థులు చదువుకుంటున్నారు. 160 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అయితే వసతిగృహ భవనం శిథిలావస్థకు చేరుకుంది. విద్యార్థులు ఉంటున్న గదులు పై కప్పు పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో భవనం పైకప్పు కూలిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇకపోతే వసతి గృహంలోని విద్యార్థులకు ముగ్గురు సిబ్బంది ఉండాలి. అయితే ఇద్దరు మాత్రమే పని చేస్తున్నారు. వీరిలో ఒకరు విద్యార్థుల కోసం మెనూ ప్రకారం ఉదయం టిఫిన్, రాత్రి భోజనం తయారు చేస్తారు. మరొకరు స్వీపర్‌గా పని చేస్తున్నాడు. వసతిగృహ ఆవరణలో అపరిశుభ్రత నెలకొంది. విద్యార్థుల కోసం 16 స్నానపు గదులు, 10 మరుగుదొడ్లు నిర్మించారు. ఆ గదులు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంతో విద్యార్థులు వసతి గృహ భవనం సమీపంలోని బహిర్భూమికి వెళ్తున్నారు. అక్కడ చెట్లు, ముళ్లపొదలు అధికంగా ఉండడంతో రాత్రి సమయంలో విద్యార్థులు బహిర్భూమికి వెళ్లిన సమయంలో విష కీటకాల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం

గతంలో ఉన్నతాధికారులకు సమస్యలను వివరించాం. ఇంజనీర్లు వచ్చి వసతిగృహ భవనాన్ని పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి కొలతలు తీసుకెళ్లారు. డివిజన్ పరిధిలోని బీసీ సంక్షేమ అధికారులు (వార్డెన్లు) అందరూ ఇటీవల గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌ను కలిసి సమస్యలను విన్నవించాం. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

రామాంజనేయులు, బీసీ సంక్షేమ బాలుర వసతి గృహం, ఇసురాళ్లపల్లి.



పెచ్చులూడిన భవనం పైకప్పు



అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్డి



అపరిశుభ్రంగా ఉన్న నీటి తొట్టి పరిసర ప్రాంతాలు

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని అధికారులు నగర పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని రామ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో కార్మికులు చేపట్టిన పారిశుధ్య పనులను బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా రామ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో మురుగునీటి కాలువలు, వివిధ కూడళ్లలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రామ్‌నగర్ పార్క్ వద్ద దగ్గరుండి కార్మికులతో చెత్త తీయించారు. ప్రజారోగ్య విభాగ సిబ్బంది తమ పనితీరును మార్చుకుని నగరంలో పన్నులు చెల్లించే ప్రజలకు సక్రమంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



చెత్తాచెదారాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

వైద్యులకు సత్కారం

రాయదుర్గం : ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులను బుధవారం ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా ఆసుపత్రి సూపరింటెండెట్ మాధవి, ఉమా మహేష్, జ్ఞాన మెర్సి, ప్రతిభ, ప్రదీప్తి, గీత, అనంత్ తదితరులకు శాలువాలు కప్పి సన్మానించారు. అదేవిధంగా రిటైర్డ్ వైద్యులు డాక్టర్ ఆత్మకూరు గోపాలరావు, పసుపులేటి సత్యనారాయణను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వి.అంబాజీరావు, కార్యదర్శి అశోక్‌కుమార్, కోశాధికారి పేర్మి సత్యనారాయణ, ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, శ్రీనివాసులు, నాగరాజు, ధనార్జన, శంకర్‌బాబు, అబ్దుల్‌కాలీక్, తదితరులు పాల్గొన్నారు.

నీళ్ల పప్పు..అరకొర భోజనం

నిధులు స్వాహా..సౌకర్యాలు నిల్-శింగనమల కెజిబివిలో అధికారుల తనిఖీలో వెలుగులోకి

ప్రజాశక్తి-శింగనమల

నీళ్ల పప్పు.. అరకొర భోజనం.. మజ్జిగ అసలే లేదు.. అసౌకర్యాల నడుమ చదువులు.. ఇదీ శింగనమల మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో పరిస్థితి... ఆకస్మిక తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు కనిపించడంతో అధికారులు అవాక్కయ్యారు. స్వయానా మండల కేంద్రంలో ఉంటే పాఠశాలలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక మండలంలోని వివిధ పాఠశాలలో పరిస్థితులు ఎలా ఉంటాయని స్థానికులు వాపోయారు.

మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలను తహశీల్దార్ శోభన్‌బాబు, ఎంపిడిఒ రమణ, ఎంఇఒలు నరసింహరాజు, శివప్రసాద్, తదితరులు బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అధికారులు విస్తుపోయే వాస్తవాలు కనిపించాయి. మధ్యాహ్నం భోజనం నాణ్యత లేకుండా, నీళ్ల పప్పు, మజ్జిగ లేకుండా అరకొర భోజనం విద్యార్థినులకు వడ్డించడం గమనించారు. స్వయంగా అధికారులు భోజనం తిని చూడటంతో నాణ్యతగా లేనందున కేజీబీవీ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు కడుపు నిండా భోజనం పెట్టకపోతే ఎలా అని నిలదీశారు. ఎస్ఒ లేకపోవడంతో ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించగా ట్రైనింగ్ లో ఉందంటూ సమాధానం ఇచ్చారు. ఇన్‌ఛార్జి ఎస్ఒ ఏమైందని నిలదీశారు. పప్పు, మజ్జిగ కచ్చితంగా ఇవ్వాల్సిందిపోయి నిధులను స్వాహా చేస్తున్నారా? అంటూ మండిపడ్డారు. పిల్లల కడుపు మీద కొడితే సహించేది లేదంటూ హెచ్చరించారు.

అంతకుముందు రికార్డులను పరిశీలించారు. ఇందులో భాగంగా అటెండెన్స్, రికార్డులు, ఆన్‌లైన్‌లోని వివరాలకు తేడాలు ఉండటంతో ఉన్నతాధికారులకు నివేదించారు. ఇప్పటికైనా ఇన్‌ఛార్జి ఎస్ఒ స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

'ఉపాధి' కూలీల సమస్యలను పరిష్కరించాలి

గుత్తి : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలను పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు వి.నిర్మల డిమాండ్ చేశారు. బుధవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇఒఆర్‌డి శివాజీ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో ఉపాధి కూలీలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించడం లేదన్నారు. ఇప్పుడైనా మిగిలిన పని దినాలకు సంబంధించి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కూలీలకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యకాసం నాయకులు ఆర్‌ఎం.కవిత, డి.పద్మావతి, లక్ష్మీ, సరోజ, దుర్గమ్మ, రబియా, రామలక్ష్మి, రంగమ్మ, బ్రహ్మయ్య, బాషా పాల్గొన్నారు.



ఇఒఆర్‌డికి వినతిపత్రం అందజేస్తున్న వ్యకాసం నాయకులు

మంత్రి సవితను కలిసిన గుత్తి నాయకులు

గుత్తి : బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితమ్మను గుత్తికి చెందిన టిడిపి నాయకులు బుధవారం పెనుగొండలోని నివాసంలో కలిశారు. ఇందులో భాగంగా టిడిపి జిల్లా కార్యదర్శి పి.శ్రీకాంత్‌చౌదరి, తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా గుంతకల్లు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో గుత్తి టౌన్‌బ్యాంకు డైరెక్టర్ జక్కా వీరన్న, టిడిపి నాయకులు ఇలియాజ్, ధన్‌పాల్, రాజేష్‌కుమార్, ధరణికుమార్ పాల్గొన్నారు.

నూనెగింజల సాగుపై అవగాహన

నార్పల : మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామంలో రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నూనె గింజల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా వేరుశనగ సాగు మీద రైతులకు అవగాహన కల్పించారు. కాగా టిసిజిఎస్-1964 వేరుశనగ సాగు చేస్తున్న రైతుల ప్రదర్శన క్షేత్రాన్ని ప్రతి 15 రోజులకు ఒకసారి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయాధికారి సందర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, మండల వ్యవసాయ అధికారి సి.చెన్నవీరస్వామి, వ్యవసాయ విస్తరణ అధికారి జి.రాము, గ్రామ వ్యవసాయ అధికారి రాజశేఖర్, నడిమిదొడ్డి సర్పంచి బి.నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

చర్మ వ్యాధి నివారణ టీకాలు

బెలుగుప్ప : మండలంలో బెలుగుప్ప, గంగవరం, బెలుగుప్ప తండాల్లో బుధవారం పశువులకు బొబ్బశర్మ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ గంగవరంలో 376, బెలుగుప్ప తండాలో 96, బెలుగుప్పలో 228 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

9న సర్వసభ్య సమావేశం

అనంతపురం అర్బన్ : ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజాపరిషత్తు సర్వసభ్య సమావేశం ఈనెల 9న నిర్వహించనున్నట్లు జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న ఉదయం 10:30 గంటలకు జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున సభ్యులు ప్రతిఒక్కరూ హాజరు కావాలని కోరారు.

'కస్తూరిబా'లో స్థానికులకు అవకాశం కల్పించాలి

నార్పల : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో స్థానిక విద్యార్థులకు అవకాశం కల్పించాలని టిడిపి నాయకులు ప్రతాప్‌చౌదరి కోరారు. ఈమేరకు బుధవారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒలు కృష్ణయ్య, నారపరెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ప్రతాప్ చౌదరి మాట్లాడుతూ పేరుకే పాఠశాల ఇక్కడ ఉందని.. ఇతర ప్రాంతాల వారే ఎక్కువగా ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు సిఫారసులు చేసిన ఇతర ప్రాంతాల వారికి ఎక్కువగా అవకాశాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్థానిక నిరుపేద, అనాథ విద్యార్థులకు అవకాశం కల్పించాలని కోరారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

డెంగీపై ప్రజలతోపాటు వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య పర్యవేక్షకురాలు శర్మస్‌వలి సూచించారు. బుధవారం మండల పరిధిలోని జూటూరు సమీపంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఎస్ఒ బి.జయమ్మ ఆధ్వర్యంలో డెంగీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతో దోమల వల్ల డెంగీ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. కావున ప్రజలు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇళ్లలో దోమతెరలు వాడాలన్నారు. అలాగే తమ ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాత టైర్లు, కొబ్బరి బొండాలు, పనికిరాని ఇనుప డబ్బాలు, ప్లాస్టిక్ వస్తువులు, రోళ్లు, ఇంటి ముందర తొట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శరత్‌బాబు, ఆరోగ్య సిబ్బంది నగీన, సుస్మలత, రామాంజనమ్మ, తదితరుల పాల్గొన్నారు.

ఉరవకొండలో వైసిపి ధర్నా వాయిదా

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి నాయకుల దాడులను ఖండిస్తూ ఉరవకొండలో గురువారం చేపట్టాల్సిన ధర్నాను వాయిదా వేస్తున్నట్లు ఉరవకొండ వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ గౌతమిసాలిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి ఉరవకొండ నియోజకవర్గంలో టిడిపి నాయకులు అరాచకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్నారు. ఇప్పటి వరకూ దాదాపు 13 ఘటనలు జరిగాయన్నారు. అంతేగాకుండా వైసిపి కార్యకర్తలు, తమకు ఓటు వేసిన వారితో బలవంతంగా బాండ్లు రాయించుకోవడం, ఇళ్లపై, వ్యక్తులపై భౌతిక దాడులకు పాల్పడటం, విద్యుత్ తీగలను తొలగిస్తూ రైతులను ఇబ్బందులు పెట్టడం వంటి ఘటనలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈనేపథ్యంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోడం కోసం శుక్రవారం భారీ జన సందోహంతో ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని విన్నవించారు. అనంతరం ఎస్పీ స్పందిస్తూ శాంతిభద్రతల రక్షణలో ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. ఆయా ఘటనలకు సంబంధించి ఇప్పటికే చాలామందిపై కేసుల నమోదు, రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నామన్నారు. అంతేగాకుండా ఉరవకొండ ప్రాంతంలో గట్ట బందోబస్తు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో నేడు నిర్వహించాల్సిన 'ప్రజాస్వామ్య పరిరక్షణ ధర్నా'ను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఎస్పీ గారిని కలిసిన వారిలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నర్సింహయ్య, నాయకులు కెవి.రమణ, సిపి వీరన్న, కోదండరామ్, కూడేరు ఎంపీపీ నారాయణరెడ్డి, బసవరాజు, కూడేరు మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఇమాములు తదితరులు ఉన్నారు.



ఎస్పీని కలిసి బయటకు వస్తున్న వైసిపి నాయకులు

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

అందిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే సురేంద్రబాబు సూచించారు. డీఎస్సీ అభ్యర్థుల సౌకర్యార్థం బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఆర్‌డిఒ రాణిసుస్మితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భావితరాలకు భరోసా అన్నారు. దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందనే అంశాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మొదటి సంతకం మెగా డీఎస్సీపైనే పెట్టారని గుర్తు చేశారు. అదేస్ఫూర్తితో నిరుపేద అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, ఆర్జీ శివశంకర్, వైపి.రమేష్, కంబదూరు లక్ష్మీనారాయణచౌదరి, ఎంఇఒ విజయ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



కోచింగ్ సెంటర్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కష్టపడిన వారికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే గుమ్మనూరు

ప్రజాశక్తి-పామిడి

పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తెలిపారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టోర్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేట్ల నియామకాల్లో పార్టీ విజయం కోసం కష్టపడిన వారికి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, నాయకులు ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, ముసిలిరెడ్డి, ఆర్‌ఆర్.రమేష్, జనసేన ధను, సోషల్ మీడియా శివ, పురుషోత్తం, తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరామ్

సీజనల్ వ్యాధులపై అవగాహన

బొమ్మనహాల్ : మండల కేంద్రంతోపాటు శ్రీధర్‌గట్ట, హొన్నూరు పరిధిలో సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ సీజన్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

అద్దెకు ఆర్టీసీ స్థలం

కళ్యాణదుర్గం : స్థానిక ఆర్టీసీ డిపో వెనక భాగంలో ఉన్న స్థలాన్ని అద్దెకు ఇవ్వనున్నట్లు డిఎ రామచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో వెనుక భాగంలో 2.47 ఎకరాల స్థలం ఉందన్నారు. వ్యాపారవేత్తలు అద్దెకు కావాలంటే కడప రీజినల్ మేనేజర్ వెబ్‌సైట్‌లో ఈనెల 16వ తేదీలోగా అప్లోడ్ చేసుకోవాలని డిఎం కోరారు.

నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి - అనంతపురం క్రైం

ఉపాధ్యాయ, ఉద్యోగులకు పూర్తిస్థాయి నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టిఎ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి శేషఫణి కోరారు. ఈమేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామాత్యులు వై.సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా అత్యవసర సేవలను అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో ఉచితంగా అందించాలని కోరారు. అలాగే మెడికల్ రీయింబర్స్‌మెంట్ గరిష్ట సీలింగ్‌ను తొలగించాలన్నారు. ఇహెచ్ఎస్ అమలు కాని కార్పొరేట్ హాస్పిటల్ (రెఫరల్/నాన్ రెఫరల్ హాస్పిటల్స్)ల్లో ఎంతైతే వ్యయం అవుతుందో అంతా ప్రభుత్వమే భరించేలా చూడాలని కోరారు. వీటితోపాటు అనేక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గూగూడులో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఓ.నల్లప్ప, మండల కార్యదర్శి కుళ్లాయప్ప బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలోని పేరుగాంచిన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 7వతేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు మంచినీరు, పారిశుధ్యం, వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. అలాగే వైద్యం, వసతులు, రవాణా, శాంతిభద్రతలు, విద్యుత్ వంటి సమస్యలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. వీలైనన్ని మంచినీటి ట్యాంకులను అందుబాటులో ఉంచాలన్నారు. దాతల ద్వారా వాటర్ పాకెట్లు పంపిణీ చేయాలన్నారు. అలాగే గ్యాంబ్లింగ్, బుబుడు ఆట, పులి, ఏనుగు, గుర్రం ఆటల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకూ పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని కోరారు.

అంధులకు 'అమ్మ' అండ

జీవనోపాధికి రూ.లక్ష వితరణ

ప్రజాశక్తి-అనంతపురం

అంధులకు అమ్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు తరిమెల రమణారెడ్డి అండగా నిలిచారు. అనంతపురానికి చెందిన ప్రకాష్, రంగయ్యశెట్టి, శెట్టూరు మండలంలోని అంజినప్పు, ఆంథోనప్ప, జానకి అనే అంధులు కేవలం ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్‌తోనే జీవనం సాగించేవారు. దీంతో జీవనోపాధి, దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స చేయించుకునేందుకు వచ్చే పింఛన్ ఏమాత్రం సరిపోయేది కాదు. వచ్చిన పెన్షన్ మందులకే సరిపోడంతో తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు లేకపోవడంతో వారి పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. ఈనేపథ్యంలో 'అమ్మ' సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డిని బాధితులు కలిసి తమకు జీవనోపాధి కల్పించాలని విన్నవించారు. వెంటనే స్పందించిన రమణారెడ్డి ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున సాయం అందించి మానవత్వం చాటుకున్నారు.



సాయం అందజేస్తున్న రమణారెడ్డి

సమస్యలు పరిష్కరించాలని వినతి

పామిడి : పట్టణంలోని 10వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వార్డు ఇన్‌ఛార్జి ముందాస్‌కు బుధవారం స్థానికులు విన్నవించారు. ముఖ్యంగా వార్డులో ఎక్కువగా డ్రెయినేజీ సమస్య ఉందని వాపోయారు. ఇందుకు ముందాస్ స్పందిస్తూ సమస్యలను ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్‌తో చర్చించి సమస్య వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాలిక్‌బాషా, మాజీ కన్వీనర్ బొమ్మామోహన్, అప్పన్నగారి కుమార్, శ్రీరాములు, సుంకప్ప, నల్లబోతుల శ్రీనివాసులు, వెంకటరమణ, తిమ్మప్ప, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.




డ్రెయినేజీ సమస్యను చూపుతున్న నాయకులు

ప్రజలకు మెరుగైన సేవలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-వజ్రకరూరు

అధికారంలు ప్రజలకు అందుబాటులో ఉండి వేగవంతంగా మెరుగైన సేవలు అందిద్దామని ఉరవకొండ ఎంపిడిఒ సుబ్బరాజు సూచించారు. బుధవారం ఉరవకొండ ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతి కార్యదర్శుల సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలతో మమేకమై పనితీరును మెరుగు పరచుకోవాలన్నారు. అలాగే బయోమెట్రిక్ అటెండెన్స్ ఉదయం 10.00 గంటలకు ఖచ్చితంగా వేయాలని సూచించారు. అన్ని గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు రోజూ 10 ఈ-సర్వీసెసులు చేయాలన్నారు. కాగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శులు గౌస్‌సాహెబ్, బాషా, నాగభూషణ, శ్రీరాములు, రమణకుమార్, ఆషీర్ బాబు, రాఘవేంద్ర, మహేష్, గౌతమి, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్బరాజు

నేరాలు ఘోరాలు

వ్యక్తి మృతి

రాయదుర్గం : పట్టణ పొలిమేరలోని బైపాస్ రోడ్డు గుట్ట వద్ద వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు బుధవారం మధ్యాహ్నం కనుగొన్నారు. బ్రహ్మసముద్రం మండలం ఏరడీకెర గ్రామానికి చెందిన నాగరాజు (62)గా గుర్తించారు. నాగరాజు వ్యవసాయ పనిముట్లు తీసుకునేందుకు మంగళవారం మధ్యాహ్నం రాయదుర్గం వచ్చాడు. అనంతరం కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా ఫోన్ రిసీవ్ చేసుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు నిన్న మధ్యాహ్నం నుంచి బుధవారం ఉదయం వరకూ అతని కోసం గాలిపు చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలో శవాన్ని బుధవారం బైపాస్ రోడ్డు సమీపంలో గుట్ట వద్ద కుటుంబ సభ్యులు గుర్తించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి శవాన్ని పరీక్ష నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగరాజు బహిర్భూమికై కొండ ప్రాంతానికి వెళ్లినప్పుడు గుండెపోటుకు గురై కిందపడి చనిపోయి ఉండవచ్చుని వైద్యులు భావించారు. నాగరాజుకు భార్య ఇద్దరు, కుమారులు కుమార్తె ఉన్నారు.




మృతిచెందిన నాగరాజు

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.



ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ